


**ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ నిఘా కరువు : ఏఐఎస్ఎఫ్**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 18 జూన్ , 2025 | పేజీలు : 06

## అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే రాజీపడేదే లేదు

### రోడ్ల నిర్మాణ పనితీరుపై అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే రాజీ పడేదే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు మంగళవారం మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు.నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు. వీటితోపాటు నియోజకవర్గంలో కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు.ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు.నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని అన్నారు..ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ పాల్గొన్నారు.

## ఇండ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్ డిమాండ్

**ప్రజాపక్షం/డిండి:** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కలను సకారం చేయాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పేదలు సైతం పనిచేసుకొని బతికేందుకు ద్విచక్ర వాహనం లేదా ట్రాక్టర్ వంటి వాహనాలు ఫైనాన్స్ మీద కొనుగోలు చేశారని అలాంటి వారికి ఆర్థికంగా ఉన్న వారు లాగా చూడకుండా వాస్తవంగా పేదలు అయినప్పటికి జీవనం కోసం వాహనాలు కొనుగోలు చేసినందున అలాంటి వారికి సైతం ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని అన్నారు. కులాలు, మతాలకతీతంగా ఇల్లులేని ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్దేశించిన చదరపు గజాలలోపే నిర్మించే విధంగా ఇండ్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని మైనోద్దీన్ కోరారు.

## చంద్రకళకు సిపిఐ నివాళులు




**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్):** తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధుడు చిలుకరాజు మరయ్య కూతురు కొమరాజు చంద్రకళ దశదినకర్మ సందర్భంగా సిపిఐ నాయకులు ఆమె చిత్రపటానికి పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ సినియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి చిలుకరాజు రాములు,మండల గీతా కార్మిక సంఘం అధ్యక్షులు చింతల బ్రహ్మయ్య,ప్రముఖ పీడియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ జేల్లా దైవాధీనం రచయిత నాగిళ్ళ శంకర్,రాంప్రసాద్ శ్రీనివాస్ నలపరాజు సైదులు,కోమరాజు చంద్రమౌళి,రవి,శ్రావణ్ కవిత కళ్యాణి పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం లబ్ధికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆదేశానుసారం నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ లబ్ధి పొందేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోచంపల్లి తహసిల్దారు శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంనకు కుటుంబ యజమాని/ఎర్నింగ్ పర్సన్ మరణించినట్లయితే మృతుని భార్యకి రూ.20 వేలు ఈ ప్రోగ్రాం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డ్ ,మరణ సర్టిఫికెట్ ,బ్యాంక్ పాస్ బుక్, రేషన్ కార్డ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, ఐకెపి నుండి ఎన్‌ఓసి ఏఏబివై/జెబివై గురించి, దరఖాస్తుదారుని ఫోటో లతో జతచేసి దరఖాస్తును తహసిల్దార్ కార్యాల యంలో సమర్పించాలని కోరారు.

## కెజిబివిలో ఉపాధ్యాయ దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నూతనంగా ఇంటర్ మీడియట్ ప్రారంభమైనందున అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ కోర్సు బోధన కొరకు గెస్ట్ ప్రాతిపదికన బోదించుటకు అర్హత గల మహిళా అభ్యర్థులు తేది 19/06/2025 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కేజిబివి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కొరకు 8790023564 కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం




## పేదల పక్షాన ఇండ్ల స్థలాలు, భూ పోరాటాలు




## సామూహిక అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సిడిపివో జ్యోత్స్నపాల్గొని చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతను, చిన్నారుల అభివృద్ధి, పునాధులు దశ అంగన్‌వాడీల ద్వారా పొందాలని తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగన్‌వాడీలకు పంపాలని తెలిపారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా పైసలెందుకు దండగా అంగన్‌వాడీ ఉండగా అనే నినాదంతో మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షమీమ్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, టీచర్స్ ఉష, మౌనిక, వీబికే సువర్ణ, విద్యా కమిటి చైర్మన్ సోమలక్ష్మీ , అంగన్‌వాడీ టీచర్ విక్టోరియా, ఆయాలు సోమలక్ష్మీ , లలిత, గర్భిణిలు, బాలితలు చిన్నారులు ఉన్నారు.





## ఐదువేలు జరిమానా

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పట్టణంలోని చర్చి కంపౌండ్ రోడ్డులో గల ఎస్ఎల్ బేకరీపై నిన్న సీతా రాంపురంకు చెందిన వారు కేక్ తిని అస్వస్థతకు గురైన విషయమై సోషల్ మీడియాలో వచ్చి వార్తకు గానూ మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అదేశాల మేరకు మున్సిపల్ సానిటరీ సిబ్బంది మంగళవారం రోజున ఎల్ఎస్ బేకరీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార పదార్థాములను పరిశీలన జరిపి షాపు యాజమానికి ఐదు వేల రూపాయల జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, యాదగిరి, శివప్రసాద్, శ్రీనివాసరెడ్డి, విక్రమ్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని కొరటికల్ గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్నం నర్సయ్య గుండె పోటుతో మరణించారు. వారి కుటుంబాన్ని కోరటికల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ పరామర్శించి కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరీదీప్ రెడ్డి సహాయంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, గ్రామ శాఖ కార్యదర్శి చుంచు శ్రీనివాస్, గ్రామ శాఖ ఉపాధ్యక్షులు చిన్నం ఇస్తారి, నాయకులు బెజ్జరబోయిన లక్ష్మ ణ్ ముదిరాజ్, నరుకుడుబిందెల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా వెంకటేశం



**ప్రజాపక్షం/బొమ్మలరామారం:** మండల సిపిఐ మండల కార్యదర్శిగా అన్నెమైన వెంకటేశం ఏడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మర్యాద గ్రామంలో నిర్మించిన తొమ్మిదవ మండల మహాసభలో ఆయనని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుసార్లు మండల సిపిఐ పార్టీ కార్యదర్శిగా అవకాశం ఇచ్చినందుకు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, రాష్ట్ర నాయకత్వానికి మండల నాయకులకు జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన వసతిగృహ అధికారులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియామకమైన బీసీ, ఎస్సీ, ఎస్టీ డిపార్ట్మెంట్ వసతిగృహ సంక్షేమశాఖ అధికారులు మంగళవారం రాష్ట్ర వసతిగృహ సంక్షేమశాఖ అధికారుల యూనియన్ కోశాధికారి బైరబోయిన లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏబీసీడీబ్లుఓ కొణతం చంద్రారెడ్డి, వసతిగృహ సంక్షేమశాఖ అధికారులు టి.వెంకటేశ్వర్లు, నుస్రత్అలీ, లక్ష్మ య్య, జాని మియా, పార్వతి, సీతా సావిత్రి, కవిత, సోమరాజు, తోట నరేష్, మంగమ్మ, సంధ్యారాణి, సతీష్, బి.రామ కృష్ణ, తరుణ్, రాకేష్, హరీష్ పాల్గొన్నారు.



# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



**ప్రజాపక్షం/మునగాల:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం, ప్రధాని మోడి, హోంమంత్రి అమిత్‌షా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు పార్టీని అంతం చేస్తామని, మావోయిస్టు పేరుతో అనేకమంది అదివాసిలను, గిరిజనులను, అమాయకులను ఎన్‌కౌంటర్ పేరుతో అనేకమందిని చంపేస్తున్నారని, ఇలాంటి పాశవిక చర్యలను ఆపాలని, అపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వక్కంతుల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. హైద్రాబాద్ ఇందిరపార్కు వద్ద శాంతిచర్చల కమిటి మహాధర్నాకు మునగాల మండలం నుండి బయలు దేరిన ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులతో కలిసి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యాన్ని ఖాళీ చేసి అక్కడ ఉన్న ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే మావోయిస్టులను చంపివేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహరావు, కామల్ల శ్రీను, కామళ్ల ఉదయ్, పులి, రాఖీ, వట్టెపు కోటయ్య, దుగ్గి అనిల్, దాసరి వెంకటేశ్వర్లు, అదూరి విజయ్ పాల్గొన్నారు.

# పర్యావరణం కాపాడుటతో సహకారం అందిస్తాం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పర్యావరణం కాపాడుటతో మావంతు సహకారం అందిస్తామని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘంజిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రం లోని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణలో భాగంగా పాఠశాలలో పిల్లలతో మొక్కలు నాటించి పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించి భవిష్యత్ తరాలకు మనం చేయూతనివ్వాలని కోరారు. గాలి, నీరు కలుషితం కాకుండా చూడాలని, ఇవి లేక పోతే మానవుని మనుగడలేదని, ప్లాస్టిక్ నివారణ, మొక్కల రక్షణ, నీటి నిల్వ చేయడం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హమీద్, మండల అధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వి.రాములు, రామిరెడ్డి, తప్పెట్ల శ్రీరాములు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకర్ పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని, ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని ప్రముఖ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కనివిని ఎరుగని రీతిలో రైతు బరోసా 9వేల కోట్లను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు కోటి 49 లక్షలు ఎకరాకు సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని తెలిపారు. రైతుల కోసం రైతు బరోసా, రైతు బీమా, రుణమాఫీ ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సూర్యాపేట జిల్లాలో సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పటేల్ రమేష్‌రెడ్డి పర్యాటక రంగంగా అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాకు 10 కోట్లతో ఉండ్రుగొండ, పిల్లలమర్రి వంటి పర్యాటక రంగాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, వల్దాసు దేవందర్, ఫరూక్, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్‌గౌడ్, బంటు చొక్కయ్య, అంజయ్య, పిల్లల రమేష్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయాలు తగవు




**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ 7 ప్రకారం అర్హత ఉన్న నిరుపేదలైన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఇవ్వాలని, ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో రాజకీయాలు తగవని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో సిపిఎం భువనగిరి మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వము లాగా కాకుండా సంక్షేమ పథకాలను అర్హత కలిగిన వారందరికీ అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కొక్క గ్రామంలో నిజమైన లబ్ధిదారులను పదుల సంఖ్యలో తొలగిస్తున్నారని నర్సింహ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాలలో నిజమైన లబ్ధిదారులను మరో మారు గ్రామ సభలు పెట్టి అందరి సమక్షంలో ఎంపిక చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ కాంగ్రెస్ గ్రామ కమిటీలుగా మారాయని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ , కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు సిలువేరు ఎల్లయ్య, పాండాల మైసయ్య, కొండపురం యాదగిరి, మధ్యపురం బాల నరసింహ, కళ్లెం లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞాపకశక్తి పెంపొందుటకు యోగా

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెంపొందుటకు యోగ సాధన ఎంతో అవసరమని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు చాడపాపిరెడ్డి తెలిపారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యాభారతి హైస్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థిని, విద్యార్థులు సైనసు, ఆస్తమా, ఆయాసం వంటి జబ్బులతో చాలమంది బాధపడుతున్నారు. విద్యాభారతి హైస్కూల్ కరస్పాండెంట్ నంద్యా ల నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నంద్యాల స్వాతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/చివ్వెంల:** కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం దొడ్డి దారిన మందబలంతో తెచ్చిన లేబర్‌కోడులను తిప్పి కొట్టేందుకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చివ్వెంల మండలంలోని సివిల్ సప్లై హమాలీ కార్మికులతో కలిసి మాట్లాడారు. దేశంలో ఎగుమతి దిగుమతి చేస్తున్న ప్రభుత్వ రంగంలోని సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై రంగంలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఆరోగ్యబీమా, పనిభద్రత, ప్రమాద బీమా పథకాలను వర్తింపజేయాలని పిలుపునిచ్చా రు. జిల్లాలో ప్రతి ఉద్యోగి, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు అధిఖ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధ్యక్షులు అమ్మయ్య, యేసు, నాగరాజు, వెంకన్న, వరుణ్, గోపాల్, దాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ జెండా దిమ్మెలు ప్రతి గ్రామంలో నిర్మించాలి

**ప్రజాపక్షం/మునగాల:** ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను ప్రతి గ్రామంలో నిర్మించి జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఫ్ రాష్ట్ర నాయకులు, మునగాల మండల ఇన్ ఛార్జి వడ్డేపల్లి కోటేష్ మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలోని బంగారు మైసమ్మ వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్ మండల కమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగల దైవం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తన జీవితాన్ని మాదిగ సమాజం కోసం అంకితం చేశాడని, ప్రతి సంక్షేమ పథకంలో మందకృష్ణ మాదిగ ముందుండి పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, బరాఖత్‌గూడెం గ్రామశాఖ అధ్యక్షులు గుడిపాటి పెద్ద కనకయ్య, నెమ్మాది రామారావు, మొలుగూరి వెంకటేశ్వర్లు, చిర్రనరేష్, పోకల వెంకటేశ్వర్లు, మొలుగూరి నాగరాజు, మొలుగూరి చంద్రయ్య, ప్రదీప్, బ్రహ్మం, బిక్షం, శ్రీకాంత్, మధు, విష్ణు పాల్గొన్నారు.



## సహాయ వంట మనిషి పోస్ట్‌కు దరఖాస్తులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలంలోని జలాల్పురం గ్రామపంచాయతీ పరిధిలోనీ ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సహాయ వంటమనిషి పోస్ట్‌కు అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు కనీసం ఏడవ తరగతి పాసయి 18నుంచి 45 సంవత్సరాల లోపు వయసు ఉండాలని, నెల 18 నుండి 21వ తేదీ లోపు సంబంధిత పాఠశాలలో పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన చిన్నం నర్సయ్య అనారోగ్య మృతి చెందగ వారి కుటుంబానికి లగ్గాల శోభా పురుషోత్తం సహకారంతో 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో లగ్గాల నరహరి, బెజ్జరాబోయిన లక్ష్మ ణ్, రాగటి పరశురాములు, రాగటి స్వామి, రంగు వెంకన్న, బొంత విగ్నేష్ దేవి, సాయికిరణ్, చిన్నం మధు, చామకూర నవీన్ పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1994/95 ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని, అప్పటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురురువులు హెడ్ మాస్టర్ సోమనర్సయ్య, బ్రమ్మచారి, అరుణటీచర్, విద్యార్థిని, విద్యార్థులు ఆకారపు వెంకన్న, టి.సిరిత, మహేశ్వరి, కె.రవి, పి.శేఖర్, మాజీ ఎంపిటిసి చిగుళ్ల ఉపేంద్ర రమేష్ తోపాటు పూర్వవిద్యార్దులు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** ఈనెల22,23నజిల్లాలోని కట్టంగూర్ లో జరగనున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక విజయ్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దేవయ్య,అంతటి శ్రీనయ్య,మారుపాక వెంకటయ్య, గుడారి వెంకటేశులు,యేసయ్య తదితరులు ఉన్నారు.




## సాగర్ డాక్టర్ కు జీవితకాల సాఫల్య పురస్కారం




**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీ నాగార్జునసాగర్ కు చెందిన డాక్టర్ గారపాటి కిషోర్ రెండు తెలుగు రాష్ట్రాలలో ఉత్తమ సర్జన్ గా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. హిల్ కాలనీలో జన్మించిన కిషోర్ పాఠశాల విద్యను స్థానిక ప్రభుత్వ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పూర్తి చేసి కళాశాల విద్యను స్థానికంగానే ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పూర్తిచేసి మెడిసన్ లో మంచి ర్యాంకుతో డాక్టర్ విద్యను పూర్తి చేసి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అతని తండ్రి జోజి స్థానికంగా ఒక సాధారణ టైలర్ గా జీవితాన్ని కొనసాగిస్తూ తమ పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో తను చేసిన కృషి అంతా ఇంతా కాదు.గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సేవ లతో పాటు కార్పొరేట్ స్థాయి శస్త్ర చికిత్సలను చేరువ చేసిన డాక్టర్ గారపాటి కిషోర్ కుమార్ ఈ అరుదైన పురస్కారం దక్కింది. లక్షల రూపాయల వ్యయమయ్యే వివిధ రకాల శస్త్ర చికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందిస్తున్న జనరల్ సర్జన్ కిషోర్ సేవలను గుర్తించి సుమన్ టీవీ హైరాబాద్ వేదికగా నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ గారపాటి కిశోర్ అవార్డును అందుకున్నారు డాక్టర్ కిషోర్‌కు పురస్కారం దక్కడంతో సహచర వైద్యులు, గ్రామస్థులు ప్రశంశలజల్లు కురిపిస్తున్నారు.

## 30న జరిగే యాదవుల ఆత్మగౌరవ సభ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : ఈనెల 30న ఇందిరా పార్క్ ధర్నాచౌక్ దగ్గర జరిగే యాదవుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఓయూ జేఏసీ నేత, బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం భువనగిరి పట్టణ కేంద్రంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రాష్ట్రంలో బీసీల్లోనే అత్యధిక జనాభా కలిగిన యాదవులకు మంత్రి పదవి, నామినేట్ పోస్టులు కేటాయించకపోవడం తీవ్ర అవమానకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో త్యాగం చేసిన యాదవులకు న్యాయమైన వాటా దక్కాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్య యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్, గొర్రె కాపర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేశబోయిన సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు సురేష్ యాదవ్, యూత్ అధ్యక్షులు రేకల రమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు పాండు యాదవ్ పాల్గొన్నారు.

## మళ్ళీ కబ్జా కుట్రకు యత్నిస్తున్న పైళ్ల దయాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలోని నాంచారిపేటలో నిర్మితమైన గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న భూ పట్టాదారు పైళ్ల దయాకర్ రెడ్డి బారి నుండి కాపాడాలని ఆ గ్రామ గౌడ కులస్తులు మోటకొండూర్ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. 2005లో 8 గుంటల స్థలాన్ని ఆలయ నిర్మాణం కొరకు అమ్మి తిరిగి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని,2008 2009 లో ఆలయ నిర్మాణం చేయడం జరిగిందని, 2018 లో గ్రామకంఠంలో నమోదు కావటం జరిగిందని, ఇప్పటివరకు పట్టాదారుని పాస్ పుస్తకం నుండి ఈ 8 గుంటల స్థలం తొలగించక పోవడంతో ఇదే అవకాశంగా తీసుకొని ఆలయ భూమిని కబ్జా చేసేందుకు చూస్తున్న పైళ్ల దయాకర్ రెడ్డి పట్టా దారుని పాస్ పుస్తకం నుండి ఆలయానికి అమ్మిన సదరు భూ వివరాలను తొలగించి, ఆలయాన్ని ఆలయ భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరి సత్యనారాయణ గౌడ్, పోతగాని సత్యనారాయణ గౌడ్, పోతగాని గోపాల్ గౌడ్, శిగ అంజయ్య గౌడ్, పోతగాని వెంకటేష్ గౌడ్,పోతగాని భాస్కర్ గౌడ్, పోతగాని సాయిలు గౌడ్, పోతగాని బాలయ్య గౌడ్,గణగాని నాగరాజు గౌడ్,పోతగాని శ్రీనివాస్ గౌడ్, పోతగాని అమరేందర్ గౌడ్, పోతగాని రామకృష్ణ గౌడ్, పోతగాని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలి



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని తౌవక్లాపూర్ గ్రామంలో నెల రోజుల కాల వ్యవధిలోనే గ్రామానికి చెందిన ఐదు గురు చనిపోవడం బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, తౌవక్లాపూర్ మాజీ సర్పంచ్ పొన్నగంటి అలివేలు కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఇటీవల చనిపోయిన మద్దెల దామోదర్, వంకేశ్వరం ఆదిత్య, వంకేశ్వరం శ్రీనయ్య, మినుగ సంజీవ, నూనె చిరంజీవి కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుల ఒక్కో కుటుంబానికి రూ. 3వేల చొప్పున తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు బ్రహ్మయ్య, వెంకటేశ్వర్‌రావు, జైపాల్, శ్రీరాములు, శ్రీను, జకరయ్య, నరేష్, వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కొరటికల్ ఉన్నత పాఠశాలలో పెరుగుతున్న అడ్మిషన్లు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొరటికల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల నుండి 12 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు పొంది పాఠశాలలో చేరినట్లు ప్రధాన ఉపాధ్యాయులు దడిపల్లి వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా దుస్తువులు, పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తుందన్నారు. గ్రామాల్లోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గాడిపల్లి ఉదయ్ కుమార్, కోల సోమేష్, నరకుడు బిందెల శ్రీహరి, వెలిమినేటి పురుషోత్తం, కోల రవి, ఏళ్లబోయిన శ్రీశైలం, ఉపాధ్యాయులు చిన్నం స్వామి, రవి కుమార్, వర ప్రసాద్, శ్రీనివాసా చారి, అనురాధ, వెంకటేష్ పాల్గొన్నారు.

## కొత్త బ్రిడ్జిని ఉపయోగంలోకి తీసుకురావాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సీతారాంపురం, బంగారుగడ్డ కాలనీల మధ్య నిర్మించిన కొత్త బ్రిడ్జిని ఉపయోగంలోకి తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం బ్రిడ్జి వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిని ఎత్తుగా నిర్మించడం వల్ల వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వర్షాకాలంలో బ్రిడ్జి లోతట్టు ప్రాంతంలోని ఇండ్లలోకి వరదనీరు చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, బావండ్ల పాండు, అయూబ్, తిరుపతి రామ్మూర్తి, వాడపల్లి రమేష్, గునగంటి రామచంద్రు, భాస్కర్, షఫి తదితరులు పాల్గొన్నారు.

## 21న మహేందర్ 4వ వర్ధంతి

**ప్రజాపక్షం/వలిగొండ** ః వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు వేముల మహేందర్ నాలుగవ వర్ధంతి సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో శివసాయి ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ కార్మికులు ఉపాధిపాలకుల వైఖరి అనే అంశంపై జరుగు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి కల్యూరి రామచందర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు సిర్పంగి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు కొండూరు సత్తయ్య, మండల నాయకులు ఉప్పలయ్య పాల్గొన్నారు.





## యాస యాదిరెడ్డి దశదినకర్మ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన యాస యాదిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి దశదిన ఖర్మలో మోటకొండూర్ మండలం నాంచారి పేట కు చెందిన కంది శశిధర్ రెడ్డి పౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డిలు పాల్గొని నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కుటుంబ సభ్యులు వాకిటి శ్రీనివాస్ రెడ్డి మామిడి వెంకటరెడ్డి, మామిడి అంజి రెడ్డి, గూడూరు మల్లారెడ్డి, కందడి శ్రీనివాస్ రెడ్డి, ఎడమ మోహన్ రెడ్డి, పూలపల్లి నర్సిరెడ్డి, సామ శ్రీకాంత్ రెడ్డి, అలివేలు, పద్మ, రేణుక, వరలక్ష్మి, ధనలక్ష్మి, పుష్పలత, సబిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** జున్ 3 నుండి 16 వరకు రెవెన్యూ గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో 2264 ధరకాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి రాగానే ధరణి రద్దు చేసి భూబారతి చట్టం అమలు చేయాలని సదస్సులు నిర్వహించారు. ఈసదస్సులతో రైతులకు న్యాయం అందుతోందని ప్రభుత్వం చెబుతోంది.

## అర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన కాడిగళ్ల రాములమ్మ చాలా రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. సమాచారం తెలిసిన వెంటనే వారి కుటుంబ సభ్యులకి ఎలిమినేటి జంగారెడ్డి ఎజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5000 సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములకొండ గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల వెంకన్న, కేసి రెడ్డి, జనార్దన్ రెడ్డి, బోడ బాలయ్య, మట్టి పల్లి రమేష్, కాడిగళ్ల నరసింహ, కాడిగళ్ల దేవేందర్, కాడిగళ్ల రాములు, ఎజేఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా 11 సంవత్సరాల పాలన

**ప్రజాపక్షం/చండూరు:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలుగా సుపరిపాలన చేస్తుందని బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య అన్నారు. మంగళవారం చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు అధ్యక్షతన మండల సంకల్ప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కాసాల జనార్ధన్‌రెడ్డి , జిల్లా కౌన్సిల్ సభ్యులు నకిరెకంటి లింగస్వామి గౌడ్ , సీనియర్ నాయకులు బొబ్బల మురళి మనోహర్‌రెడ్డి , యువమోర్చ రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి ,అన్నెపర్తి యాదగిరి , మాదగోని నాగార్జున , జెట్టి యాదయ్య, నల్పరాజు యాదగిరి, మాదగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## పిల్లల భవిష్యత్తు అంగన్‌వాడీ సెంటర్‌తో అభివృద్ధి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** చిన్నపిల్లల భవిష్యత్తు అంగన్వాడి సెంటర్ ద్వారానే అభివృద్ధి చెందుతుందని డీ డబ్ల్యూ నరసింహ్మా రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఐదవ అంగన్వాడి సెంటర్‌లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌లో చదువుకున్న పిల్లలు ప్రభుత్వ అందించే పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని అంతేకాకుండా ఆటపాటలతో చదువు నేర్చుకోవడానికి ఉత్సాహం చూపుతారన్నారు. సిడిపిఓ సైలజ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్వాడి సెంటర్లలో అందిస్తున్న పోషక ఆహారాన్ని తమ పిల్లలకు అందించడంలో తల్లులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కారణ, అంగన్వాడీ టీచర్లు హైమావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల కోసమే రైతు భరోసా డ్రామాలు

**ప్రజాపక్షం/గుండాల;** స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా అమలు చేస్తామని డ్రామాలు అడుతుందని మాజీ జెడ్పి వైస్ చైర్మన్ గడ్డమీది పాండరి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోయిన వానాకాలం రైతు భరోసా ఎమైందని, యాసంగి రైతు భరోసా ఎమైందని ఇప్పుడు మాత్రం ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేస్తున్నట్లు నాటకాలు ఆడుతుందని స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లి రైతు భరోసా డ్రామాలను ఆడుతుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చలేదని రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, రైతు భరోసా లేదని, రైతు బంధు లేదని, గ్యాస్ సబ్సిడి కూడా మాయం అయిందని అన్నారు. సన్నాలకు 500 బోనస్ ఏమైందని, రేషన్ కార్డులు లేవని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు అమలు చేస్తామని చెప్పి నేటికి చేయకుండా కాలయాపన చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ నేటికి ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తి స్థాయిలో విఫలం అయిందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం




**ప్రజాపక్షం/వలిగొండ :** భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ 11 ఏళ్ల పరిపాలన పైన వికసిత్ భారత్ అమృతకాలం అనే కార్యక్రమం పై వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ మండల కన్వీనర్ లోడే లింగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన గ్రామాలు, సుభిక్షంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోటి అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని, రైతులకు, మహిళలకు, అనేక రకాల కుల వృత్తుల వారికి మోడీ సంక్షేమ ఫలాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎన్ రెడ్డి, వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ ఏలే చంద్రశేఖర్, జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి, రాచకొండ కృష్ణ, బంధారపు రాములు కందుల తానేష, మందుల లక్ష్మి, బొడిగె ఆనంద్, బచ్చు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చగిరి, రేగూరి అమరేందర్, వికసితు భారత్ మండల కో కన్వీనర్ మందడి రంజిత్ రెడ్డి, గంగాధర్ దయాకర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగాలని డీఐఈఓ దస్రూనాయక్ సూచించారు.ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని చర్లపల్లిలో గల ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన ఈ సందర్భంగా మంగళవారం డిఐఈఓ ఎస్ ఆర్ కళాశాలకు విచ్చేసి ఆ కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థిని ప్రియాంకను సన్మానించారు. అదే విధంగా మెడిసిన్ ర్యాంక్ సాధించిన ఎస్. పావని, లేఖన, ప్రవల్లిక,జ్యోతి,గాయత్రి,దివ్య ధరణి లను వారి తల్లీ దండ్రులను సాల్వాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి , డీన్ కిషోర్ బాబు, ఏఓ సరితారెడ్డి , అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న, శ్రీనివాస్,శోభ విద్యార్థుల అభినందించారు.







## సామూహిక అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులకు మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో ఖతిజ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పై బడిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అన్నారు. ఆట, పాటలతో విద్యార్థులకు చదువు నేర్పిస్తూ, ఎగ్ బిర్యాని, పౌష్టికాహారంను అందిస్తున్నామని అన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి పాఠశాల ఆవరణలో సిడిపివో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపివో సరళ, సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ అరుంధతి, ఆయా సుమతి, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

## సిపిఐ(ఎం)లో 15 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/మోతె:** సిపిఎం పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై ప్రజలందరు స్వచ్ఛందంగా సిపిఎం పార్టీలోకి చేరుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మోతె మండలంలోని విభాళపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నాగయ్యగూడెం గ్రామానికి చెందిన బొర్రాజు వెంకన్న, కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన గుండాల భయ్యన్న నాయకత్వంలో వివిధ పార్టీలకు రాజీనామా చేసి 15 కుటుంబాలు సీపీఎం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నాగయ్యగూడెంలో నూతనంగా నిర్మించిన సిపిఎం పార్టీ జెండా దిమ్మెను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టపల్లి సైదులు, గోపాల్‌రెడ్డి, ఎలిగి వెంకటరెడ్డి, నాగం మల్లయ్య, కక్కిరేణి సత్యనారాయణ, కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, బూడిద లింగయ్య, సోమగాని మల్లయ్య, జంపాల స్వరాజ్యం, వెలుగు మధు, కోడి లింగయ్య పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలలో జమ చేయడం హర్షించ దగ్గ విషయం అని అన్నారు. ప్రభుత్వం 9రోజుల్లో రూ. 9వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయనుందని పేర్కొన్నారు. 18 నెలల్లో ప్రజా ప్రభుత్వం రైతుల కోసం రూ. 1,01,728 కోట్లు ఖర్చుచేసిందన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ చేస్తున్న అభివృద్ధి పనులతో రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందడం ఖాయం అని ధీమా వ్యక్తంచేశారు.

## అంతర్జాతీయ కరాటే దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అంతర్జాతీయ కరాటే దినోత్సవ వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కరాటే మాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సురేష్ కరాటే నేర్చుకొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జైహింద్, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్‌దారులకు ఆశనిపాతంలా కేంద్ర చట్టం




### -పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం పింఛన్‌దారులకు ఆశనిపాతంలా మారనుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మార్చి మాసంలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన ఈ చట్టంతో దేశ వ్యాప్తంగా పింఛన్‌దారులు పలు సమస్యలను ఎదుర్కొననున్నారని ఇందుకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు, ఆందోళనలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం కృషి భవన్‌లో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఇప్పటికే ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసిందని సంతక సేకరణ చేపట్టాలని పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఆ పిలుపుకు అనుగుణంగా పింఛన్‌దారులు ఐక్యంగా కదిలి చట్ట రద్దు కోసం జరిగే పోరాటంలో పాలు పంచుకోవాలని పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు డిఆర్‌ను నగదు పూర్వకంగా చెల్లించాలని, పదవి విరమణ తర్వాత బకాయిలను సత్వరమే చెల్లించాలని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పింఛన్ దారులకు వైద్య సౌకర్యం ఉందని చెబుతున్న అది అమలులో సాధ్యం కావడం లేదని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పుల్లయ్య కోరారు. ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందించడంలో వైఫల్యం చెందిందని మౌలిక సదుపాయాలు కానీ సరిపడ మందులు కానీ వెల్‌నెస్ సెంటర్‌లో లేకపోవడం బాధాకరమన్నారు. సమృద్ధిగా మందులను సమకూర్చడంతో పాటు విస్తృత సేవలు అందించే ప్రాతిపదికన వెల్‌నెస్ సెంటర్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలపై విడతల వారీగా ఆందోళనకు సిద్ధం కావాలని సంఘం పక్షాన పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలు మాత్రమే సమస్యల పరిష్కారానికి దోహదపడతాయన్నారు. ఎవరో చేస్తారు సమస్య పరిష్కారం అనుకున్న దాని కంటే అందరూ ఐక్యంగా కదిలితే పరిష్కారం శీఘ్రగతిన లభిస్తుందన్నారు. ఈ సమావేశం ఇటీవల మృతి చెందిన ప్రముఖులకు నివాళులర్పించింది. సమావేశంలో ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు భాస్కరాచారి, మేరీ ఏసుపాదం, లక్ష్మి సుజాత, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వీరభద్రరావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, ప్రకాష్, రామనాథం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘డ్రైడే’ కార్యక్రమాలను నిర్వహించాలి

### -యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎంఅండ్‌హెచ్‌వో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం యుపిహెచ్‌సిని డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. యుపిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలపై సమీక్షించారు. ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ సిబ్బంది డ్యూటీ ఛార్జ్, ల్యాబ్ టెక్నీషన్ సేవలను పరిశీలించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో డయేరియా నివారణకు జూన్ 16 నుంచి ప్రారంభమైన స్టాప్ డయేరియా కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. జూన్ నుండి నవంబర్ వరకు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి దోమల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. జ్వరం, వాంతులు, విరోచనలు వంటి సమస్యలు వస్తే తక్షణమే వైద్య సేవలను పొందాలని తెలిపారు. ఆశాలు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని, పారా మెడికల్ సిబ్బంది విధులను పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సర్వీస్ రూల్స్ ప్రకారం సిబ్బంది పై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణచైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సహకారంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో గల ఎంపి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేర్చుతున్న ఆటో డ్రైవర్లకు యూనిఫాం (ఖాకీ చొక్కాలు)లను ఎంపి సమకూర్చడం సంతోషకరమన్నారు. ఆటో డ్రైవర్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటో కార్మికులకు ఎంపి క్యాంపు కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కొప్పుల చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణయ్య, నాయకులు శ్రీను, జంగిపల్లి ప్రసాద్, సిద్దల నగేష్, తోట సైదులు, కె. మధు, ఎ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని సఖినవీడు గ్రామానికి చెందిన అల్లు దేవదాస్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారి కుమారుడైన అల్లు వంశీకి అందచేశారు. ఈకార్యక్రమంలో సఖినవీడు గ్రామశాఖ అధ్యక్షులు పసుపులేటి వెంకటనారాయణ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ, అనుమోలు వెంకటకృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, నాగిరెడ్డి దేవరకొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కాశీపురంలో రెవెన్యూ సదస్సు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామపంచాయితీ పరిధిలో రెవెన్యూ సదస్సు ద్వారా సమస్యలను వెలికితీస్తున్నట్లు అల్లంపూరు తాసిల్దార్ మంజుల తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కాశిపురం గ్రామంలో గ్రామ రెదెన్యూ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సులో భూ సమస్యలపైన 14 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. బుధవారం లింగనవాయి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దారు వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రెవెన్యూ సిబ్బంది , రైతులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టి పర్యటనను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో భాగంగా బుధవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్త తెలిపారు. మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.8.20కోట్లతో నిర్మించనున్న నూతన ఆర్టిసి బస్టాండ్ పనులకు శంకుస్థాపన, నూతన బస్సుల ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిపో రాష్ట్ర, జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని దెందుకూరు హైస్కూల్‌లో చదవుతున్న సుమారు 70మంది విద్యార్థులకు దాతల సహకారం రూ.15వేలతో రాత పుస్తకాలను జిల్లా కోర్డినేటర్ చుంచు రామకృష్ణ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ వై.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సేవాభావంతో నోట్ పుస్తకాలను అందించిన దాతలను అభినందించారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు పొలిమేర జీవన్‌లైన్మెన్, యుద్ధపూడి జ్యోతి, హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పగిడిపల్లి శాంతమ్మ, పాఠశాల హెచ్ఎం డి.శ్యామలరావు, గ్రామ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌తో గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** గిరిజన తండాల్లో గిరిజనుల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ధర్తి అబజన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభించిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలు నమోదు చేశామని ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్ తెలిపారు. గిరిజనుల్లో ఉన్న మొత్తం 700 తెగలు ఉప కులాలు ప్రకారం వారి జీవన స్థితిగతులు సాధికారితపై కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలోని ఆరు మండలాలను ఎంపిక చేయగా తిరుమలాయపాలెం మండలంలోని సుద్దవాగు తండా, సోలిపురం, లక్ష్మీదేవిపల్లి, హైదరసాయిపేట గ్రామాలను గిరిజన గ్రామలుగా ఎంపిక చేయగా సుద్దవాగుతండా నందు ఇంటింటి సర్వే ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సర్వేలో గిరిజన తండాల్లో నివసిస్తున్న ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, వారి స్థితిగతులపై పూర్తిగా వివరాలను నమోదు చేశామని తెలిపారు. అందరికి ఆధార్ కార్డులు, ఆయుష్మాన్భవ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందాయా లేదా, అందరికి విద్యుత్ సౌకర్యం ఉందా లేదా, అందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయా లేవా వంటి తదితర అంశాలను సర్వేలో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఖలీల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఎఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ(ఎం) సత్తా చాటాలి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కసరత్తు ప్రారంభించిందని, త్వరలో జరుగనున్న ఎన్నికల్లో సిపిఎం పార్టీ సత్తా చాటాలని సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రుపాలెంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో నల్లమోతు హన్మంతరావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమల చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా డబ్బులను రైతుల అకౌంట్‌లో జమ చేస్తుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు, మండల కమిటీ సభ్యులు సగ్గుర్తి సంజీవరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, షేక్.లాల్, దూదిగం బసయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.193.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా వానా కాలంకు సంబంధించి రూ.193,44,97,643 లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మంగళవారం తెలిపారు. ప్రభుత్వం వానా కాలానికి సంబంధించి రైతు భరోసా నిధులను విడుదల చేసిందని సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో రైతు భరోసాకు సంబంధించి 3,53,794 మంది రైతులకు గాను మొత్తం రూ. 436,84,65,365 జమ చేయాల్సి ఉందన్నారు. మొదటి రోజు అనగా ఈనెల 16న ఎకరం, రెండు ఎకరాల లోపు ఉన్న 2,13,932 మంది రైతులకు రూ. 123,38.40,175 జమ చేయడం జరిగిందన్నారు. ఈనెల 17న మంగళవారం మూడు ఎకరాల వరకు భూమి గల 46,859 మంది రైతులకు రూ.70,06,57,468 లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 2,60,791 మంది రైతులకు రూ. 193,44,97,643 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.




2025 జూన్ ఐదు నాటికి పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు డిబిటి ఫెయిల్ అయిన రైతు సోదరులు సంబంధిత ఏఈవోలను సంప్రదించి రైతు భరోసా కోసం ఖాతా నెంబర్‌ను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# జిల్లా కలెక్టర్‌గా తనదైన ప్రత్యేకతను చాటారు

## -కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసిన దయాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్‌గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వహించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బదిలీ అయ్యే వరకు నిబద్ధతతో పని చేశారన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



# అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

**ప్రజాపక్షం/కూసుమంచి :** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం ప్రాజెక్టు ఆధ్వర్యంలో కూసుమంచి మండల స్థాయిలో జీళ్ళ చెరువు గ్రామంలో ఉన్న రైతు వేదిక నందు మంగళవారం నాడు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రామ్ గోపాల్ రెడ్డి, హాజరయి అంగన్వాడీ స్కూల్స్ పిల్లల అభివృద్ధి క్షేత్రాలుగా తీర్చిదిద్దబడుతున్నాయని కావున పిల్లలందరినీ కూడా అంగన్వాడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రీ స్కూల్ కార్నర్స్, ప్రీస్కూల్ మెటీరియల్ ఎగ్జిబిషన్, పిల్లల విచిత్ర వేషధారణలు, ఫాన్సీ డ్రెస్సెస్, 25 మంది పిల్లలకు అక్షరాభ్యాసములు ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు, గ్రాడ్యుయేషన్ డే, ఈ కార్యక్రమాలన్నీ కూడా డి డబ్ల్యు ఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం పిల్లలందరికీ కూడా ఈ సంవత్సరము నూతనంగా ప్రవేశ పెట్టబోతున్న మెనూ లో భాగంగా ఎగ్ బిర్యానీ చేసి పిల్లలకు వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత హాజరైన తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ,



పిల్లల యొక్క మేధో వికాసం గురించి, అంగన్వాడీలో కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలలో కలిగే అభివృద్ధిల గురించి వివరించినారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్ద పెండ్ర అంజయ్య , అంగన్వాడి సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్, ఆశా వర్కర్స్, గ్రామంలో ఉన్న తల్లులు, మండలంలోని తల్లులు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన కూసుమంచి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన బానోత్ మణి చంద్ర (22) మృతి చెందగా తండ్రి బాలాజీకి కాళ్లకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి బాలాజీతో కలిసి మణిచంద్ర మోతె మండలం బురక చర్లలో ఓ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా కూసుమంచి సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న డిసిఎం వాహనం ఒక్కసారిగా ఆగి పోవడంతో దానిని వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మణిచంద్ర అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి బాలాజీకి కాళ్లకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలాజీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మణిచంద్ర తల్లి రంగాబాయి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ కొద్ది నెలల క్రితమే గుండెపోటుతో మృతి చెందింది. నెలల వ్యవధిలోనే తల్లి, కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మణిచంద్ర డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు.



# జీళ్ళ చెరువులో ప్రభుత్వ భూమి కబ్జా



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలోని జీళ్ళ చెరువు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 616 లో గల 30 కుంటల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని దాని వెంటనే అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇదే భూమిపై గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అప్పట్లో కబ్జాలు చేసిన వారిని తొలగించిన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో తిరిగి కబ్జాదారులు ఆ భూమిపై కన్నేసి కబ్జా చేస్తున్నారన్నారు. గతంలో పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుంట భూమి 5నుండి 6 లక్షల రూపాయల ధర



పలుకుతుంది. ప్రస్తుతం ఆ భూమి విషయంలో గతంలో ఫిర్యాదు చేసిన వారు ఆక్రమించిన వారు ఒక అవగాహనకు వచ్చి తిరిగి ఆ భూమిని తమ సొంతం చేసుకోవాలని ఆరాటపడుతున్నారన్నారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన ఒక 10 నుండి 15 మంది కుమ్మక్కై ఆ భూమిని ఎలాగైనా తమ సొంతం చేసుకోవాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సంఘాలు పారిశ్రామిక వేత్తలుగా మారాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్వయం సహాయక మహిళా సంఘాలు పారిశ్రామికి వేత్తలుగా మారాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తుందని, సెర్ఫ్ డిపిఎం నాగజ్యోతి, రమాకాంత అన్నారు. ఈ సందర్భంగా రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెనియర్ ఆఫ్ ఇండియా ప్రపంచ బ్యాంకు నిధుల సహకారంతో భారత ప్రభుత్వం రైసింగ్ అండ్ యాక్సిలెరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన మహిళా సంఘాల వారికి పదిహేను రోజుల పాటు శిక్షణను అందించి బ్యాంకుల ద్వారా రుణసదుపాయాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల , పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, అశ్వారావుపేట 9 మండలాలకు చెందిన స్వయంసహాయ సంఘాలు హాజరైన ఈ కార్యక్రమంలో ఏపిఎంలు జూపల్లి జగదీష్, సిసిలు, పులుసు సీతారామయ్య, పాగా రాంబాబు, ఎంఎంఎస్ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.




# కొత్త వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఓఎస్డి నరేందర్ సూచనలతో టేకులపల్లి సిఐ టి సురేష్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం, పెద్ద వెంకటాపురం గుత్తికోయ గ్రామాలలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రొగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా కల్పించారు. అలాగే తెలియని వ్యక్తులు తమ తమ గ్రామాలలోకి ప్రవేశిస్తే వారికి ఆశ్రయం కల్పించొదని సిఐ సురేష్ సింగారం, వెంకటాపురం గుత్తికోయ గ్రామస్తులకు తెలిపారు. ఇటీవల వరుస ఎదురు కాల్పులు, అరెస్టుల వలన అసాంఘీక శక్తులు తమ రక్షణ కోసం చత్తీష్‌ఘడ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు, మావోయిస్టు సానుభూతిపరులు మీ గ్రామానికి మీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, ఈ సమాచారం తెలిపిన వారి వివరాలు



గోప్యంగా ఉంచి వారికి తగిన నగదు పారితోషకంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని, వారికి దూరంగా ఉండాలని తెలిపారు. యువత మంచిగా చదువుకొని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు సంపాదించాలని, క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్ఐ ఎం సోమేశ్వర్, టీజీఎస్పీ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకుల డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్రంలో మైనారిటి గురుకుల డిగ్రీ కళశాలనను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా మైనార్టీ గురుకులాల కార్యద్శి బి షఫీవుల్లాను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల జూనియర్ కాలేజీలు ఉన్నాయని, ప్రతీ ఏటా పది వేల మంది ఇంటర్ పూర్తి చేస్తున్నారని, మైనార్టీ డిగ్రీ కాలేజీలు లేకపోవడంతో చాలా మంది అక్కడితో చదువులు ఆపేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి లకు రాష్ట్ర వ్యాప్తంగా 79 డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, మైనార్టీలకు ఒక్కటి కూడా లేదన్నారు. దీంతో మైనార్టీలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని బాలబాలికలకు వేర్వేరుగా మైనార్టీ గురుకుల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు హామీ ఇచ్చినట్లు యాకూబ్ పాషా తెలిపారు.

